క్లుప్తంగా

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న గాయత్రీ మాత

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపా మోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

బురుజుల సొసైటీ అధ్యక్షుడి రాజీనామా


రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న సుబ్బయ్య

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామ సొసైటీ అధ్యక్షుడు సుబ్బయ్య తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సీఈఓ మల్లికార్జునకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కంగాటి శ్రీదేవి, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో లేకున్నా గ్రామ సమస్యలకు పరిష్కారం, గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు


ఎమ్మెల్యే శ్యామ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు

పత్తికొండ రూరల్: నూతనంగా ఎన్నికైన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబుకు శుక్రవారం ఆయన గృహంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు ప్రవీణ్‌కుమార్, మురళీమోహన్, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, గోపాల్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలి పారు. అదేవిధంగా ఆర్టీసీ యూనియన్ నాయకులు హారుస్‌బాషా, కేఈ అయ్యన్న గౌడు, బీఎం బాషా, నాగరాజు తదితరులు ఎమ్మెల్యే ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

తుగ్గలి : 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వతరగతి విద్యార్థులు రమావత్ రంజిత్‌నాయక్, రమావత్ వెంకటేష్‌నాయక్, జె పద్మ ఎంపికైనట్లు హెచ్‌ఎం ఉపేంద్ర తెలిపారు.

సేంద్రియ ఎరువులనే వాడాలి

హాలహర్వి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు పంటలను సాగు చేస్తున్నారని, రైతులు సేంద్రియ, కృత్రిమ ఎరువులను వాడాలని ఏఓ శివశంకర్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడితే నేల సారవంతం పెరుగుతుందన్నారు. అధిక ధరలకు రసాయన ఎరువులు కొనుగోలు చేసి పెట్టుబడి ఖర్చులు పెంచుకోవద్దని సూచించారు. రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారి సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతిరైతు పంటసాగుకు ముందు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు.

టీడీపీ దాడులపై ఆందోళనతో ఎంపీటీసీ మృతి


పెద్ద పెద్దయ్య (ఫైల్)

ఆదోని రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తల దాడులతో ఆందోళనకు గురై గుండెపోటుతో ఎంపీటీసీ పెద్ద పెద్దయ్య (70) మృతి చెందారు. రెండు రోజుల క్రితం మండలంలోని అలసందగుత్తి గ్రామంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఇళ్లలోకి వెళ్లి మూకుమ్మడిగా దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో అలసందగుత్తికి చెందిన బసరకోడు ఎంపీటీసీ ఎం.పెద్దపెద్దయ్య కుమిలిపోయాడు. టీడీపీ నాయకుల అరాచకాలను భరించలేక ఇంట్లోనే బిక్కుబిక్కుమంటూ దిగాలుగా ఉన్నాడు. శుక్రవారం గుండెపోటుకు గురై మృతిచెందారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య ఈరమ్మ, సభ్యులు బోరుమని విలపించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నకిలీలపై జాగ్రత్త

- విత్తనాలు, ఎరువుల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి
- మార్కెట్‌లో విచ్చలవిడిగా నకిలీలు


పొలంలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు (ఫైల్)

ఆలూరు రూరల్: ఖరీఫ్‌లో వివిధ పంటలను సాగు చేసే రైతన్నలు ముందుగా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలోనే అనుమతులు లేని కంపెనీల విత్తనాలు, ఎరువులు మార్కెట్‌లోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో నకిలీ విత్తనాలు మార్కెట్లోకి రాకుండా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విత్తన విక్రయ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. విత్తనాలు కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు, ఎరువుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఒకటికి రెండు సార్లు ఆలోచించి అన్ని వివరాలు పరిశీలించి విత్తనాలు కొనుగోలు చేయాలి.
- లైసెన్స్ లేని వ్యక్తులు, దుకాణాలు, దళారుల నుంచి కొనుగోలు చేయరాదు.
- సరుకు లాట్ నంబర్, తయారీ తేది, రకం, ఇలా అన్ని వివరాలు కలిగి ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుంచి తప్పనిసరిగా తీసుకోవాలి.
- సంచులపై సీలు విప్పినట్లు లేదా సీలు విప్పి తిరిగి కుట్లు వేసిన వాటిని కొనరాదు.
- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకారం సంఘాల నుంచి మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలి.
- విత్తన బస్తాతో లభించే ట్యాగ్ ఉందో లేదో గమనించి తీసుకోవాలి. ఆ ట్యాగ్‌ను ఏడాది పాటు భద్రంగా ఉంచుకోవాలి.
- పురుగు మందుల డబ్బాపై కంపెనీ పేరు, తయారు తేదీ, కాలపరిమితి గడువు, గమనించి అందుకు అనుగుణంగా బిల్లు తీసుకోవాలి.
- ఏది ఎంత ధరకు కొన్నా డీలర్ లేదా దుకాణదారుడి సంతకంతో బిల్లు పొందాలి. నకిలీవి అని అనుమానం వస్తే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చు.
- లైసెన్స్ లేకుండా విత్తనాలు ఎరువులు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- నకిలీలని తేలితే విత్తనం, ఎరువుల, క్రిమీసంహారక చట్టాల ప్రకారం సంబంధిత డీలరు, కంపెనీ, దుకాణాదారునిపై వెంటనే కేసు నమోదు చేస్తారు.


ఆలూరు ఫర్టిలైజర్ షాపులో రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

అనుమతి లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దు



ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోకండి. బ్యాచ్ నంబరు లేని పురుగు మందులు కొనుగోలు చేయరాదు. విత్తనాలు, ఎరువుల కొనుగోలులో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసిన దుకాణం నుంచి బిల్లు తీసుకోవాలి. ఆ బిల్లును పంట చేతికి వచ్చే వరకు భద్రంగా ఉంచుకోవాలి. ప్రైవేటు వ్యక్తుల దగ్గర విత్తనాలు కొనుగోలు చేయరాదు.

– సునీత, ఏడీఏ, ఆలూరు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

చిప్పగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈఓ బాలనాయుడు చిన్నారుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా అందిస్తారన్నారు. నైపుణ్యం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే విద్యా బోధన ఉటుందని చెప్పారు. 8 తరగతిలోపు పిల్లలు ఎలాంటి టీసీ లేకుండా నేరుగా పాఠశాలల్లో చేరవచ్చన్నారు. ప్రైవేట్ పాఠశాలల మాయలో పడకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

పాడి సంరక్షణపై అవగాహన

ఆలూరు: పాడి పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా టీకాలు వేయించేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆలూరు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ విక్టర్ బాబు ఆ శాఖ సచివాలయ అధికారులను ఆదేశించారు. స్థానిక ఏడీఏ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పశువులకు హెచ్‌ఎస్, బీక్యూ టీకాలను వేశారు. వర్షాల కారణంగా పశువులు, మేకలు, గొర్రెలు, గేదెలు జబ్బుల బారిన పడే అవకాశం ఉందని, వ్యాధుల నివారణకు టీకాలు వేయించాలని సూచించారు. పచ్చిక బైళ్లలో నిలిచిన వర్షపు నీటిని పశువులకు తాపరాదన్నారు. అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది బాషా తదితరులు ఉన్నారు.

విస్తారంగా వర్షాలు


తుగ్గలి చెరువు వద్ద తెగిన తారు రోడ్డు

ఆలూరు రూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో గురువారం రాత్రి ఆలూరు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. నిన్న రాత్రి ఆలూరులో కురిసిన వర్షానికి ఎల్లార్తి రోడ్డు చిత్తడిగా మారింది. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

చిప్పగిరి: గత వారం రోజులుగా మండలంలోని విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సకాలంలో కురుస్తున్న వర్షాలకు పొలాలు అదును కావడంతో మండల రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. పొలాల్లో ఎరువులు చల్లడం, గుంటక, నాగలి పాస్తూ ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో అధికంగా కంది, వేరుశనగ, కొర్ర, పత్తి, తదితర పంటలు సాగుచేస్తారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో ఈసారి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

హాలహర్విలో భారీ వర్షం

హాలహర్వి: మండలంలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. వర్షం రాకతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాల్లో వర్షపునీరు నిలిచింది. హాలహర్వి ఎస్సీ కాలనీ, మాచనూరు గ్రామాల్లో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం కురిసిన ప్రతిసారి ఇలా జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను ఏర్పాటు చేసి వర్షపునీరు ముందుకు పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వర్షానికి చిత్తడిగా మారిన ఎల్లార్తి రోడ్డు


హాలహర్వి ఎస్సీ కాలనీలో ప్రవహిస్తున్న వర్షపునీరు


వీధిలో మోకాలిలోతు చేరిన వర్షపు నీరు


పొలాల్లో నిలిచిన వర్షపు నీరు




రామదుర్గం వద్ద పొలాల్లో కురుస్తున్న వర్షం, పొంగిపొర్లుతున్న పత్తికొండ-చక్రాళ్లరోడ్డులోని బుగ్గ వంక, పత్తికొండ చెరువుకు చేరుతున్న వర్షపు నీరు

తుగ్గలి: మండల కేంద్రం తుగ్గలితోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి తుగ్గలి–మామిళ్లకుంట గ్రామాల మధ్య చెరువు వద్ద రోడ్డు తెగిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముందస్తు వర్షాలకు పలుచోట్ల కుంటలు, చెక్ డ్యామ్‌లు నిండిపోయాయి. చెరువులకు కూడా నీరు చేరుతోంది. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఆముదం, కంది, వేరుశనగ విత్తనం విత్తేపనిలో రైతులు బిజీ అయ్యారు.

దంచికొట్టిన వాన

పత్తికొండ రూరల్ : మండలంలో వాన దంచికొట్టింది. శుక్రవారం మధ్యాహ్నం సుమారు గంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన ఎడతెరపని వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలుపొంగిపొర్లా యి. ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. వర్షంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. పత్తికొండ ఊరిచెరువుకు వరద నీరు చేరింది. భీకరమైన ఉరుముల శబ్దాలతో పొలాల్లోని రైతులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

ఎడతెరిపివ్వని వర్షం

కృష్ణగిరి: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండల వ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పంట పొలాల్లో నీరు నిలిచింది. పంటలు సాగు చేసుకునే సమయంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలకు వాగులు, వంకలకు నీరు వస్తుండటంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని హంద్రీ బడ్డున ఉండే గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల వ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షానికి వెల్దుర్తి పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రహదారిలో నివాసం ఉంటున్న పూల ఖాజా మట్టి మిద్దె శుక్రవారం తెల్లవారుజామున కూలింది. అయితే ఇంటి ముందు వరండాల్లో ఖాజాతోపాటు భార్య షబానా, ఇద్దరు పిల్లలు నిద్రిస్తుండటంతో ప్రాణాపాయం తప్పింది. తమకు ప్రభుత్వం వ్యక్తిగత గృహం మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు కోరారు.


వెల్దుర్తిలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో కూలిన మిద్దెను చూపుతున్న షబానా

హొళగుందలో 42.4 మి.మీ వర్షం

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వీధులు జలమయమయ్యాయి. హొళగుందలో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. హైస్కూల్ గ్రౌండ్, ఎస్‌బీఐ బ్యాంకు, తేరుబజారులో నీరు చేరాయి. హొళగుంద పెద్ద చెరువుతో పాటు ఆయా గ్రామాలలో చెరువుల్లో జలకళ సంతరించుకుంది. రైతులు జోరుగా సేద్యం పనులు మొదలు పెట్టారు. శుక్రవారం మృగశిర కార్తె రావడంతో పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద వేదావతి (హగరి) నది వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తోంది. మండలంలో శుక్రవారం 42.4 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.


పెనుమాడ సమీపంలో భారీగా కురుస్తున్న వర్షం


మార్లమడికి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి నది

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు


మొలగవల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయని గ్రంథాలయ అధికారి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులతో పుస్తక పఠనం, కథల పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, యోగా, డ్యాన్స్, కంప్యూటర్ నందు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థులకు చెస్, క్యారమ్స్‌తో పాటు ఆటల పోటీలు నిర్వహించామన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముగింపు కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తిరుమలరావు, రామాంజనేయులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి


మొలగవల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఆలూరు రూరల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని మొలగవల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, వాటి కారణంగా మలేరియా, డెంగీ వంటి తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. వ్యాధుల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. దోమల నుంచి రక్షణ కోసం దోమ తెరలు వాడాలన్నారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ ఆంద్రూస్, సూపర్‌వైజర్ బాషా, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, ఏఎన్‌ఎంలు రుక్మిణి, యశోధ, ఆశాలు కళావతి, మల్లిక, సునీత తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి


వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

మద్దికెర: ఉద్యోగులకు తప్పనిసరిగా విరమణ ఉంటుందని, వారి సేవలకు కాదని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరామిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించారు. డీఎస్పీతోపాటు సీఐలు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు ఆయనకు శాలువాలు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల అనుభవాలను పోలీస్‌శాఖకు, సిబ్బందికి ఎంతో అవసరమని ఈ సందర్భంగా డీఎస్పీ గుర్తు చేశారు. కార్యక్రమంలో పత్తికొండ, దేవనకొండ, ఆలూ రు సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మద్దికెర, కసాపురం ఎస్‌ఐలు రమేష్‌బాబు, దుర్గిరెడ్డి ఏఎస్‌ఐలు ఫణిరాజ్, చెన్నయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలసందగుత్తిలో పోలీస్ పికెట్

ఆదోని రూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో ఈ నెల 5వ తేదీన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేసిన ఘటనలో ఇరువర్గాల వారిపై కేసులు నమోదయ్యాయి. కేసు వివరాలను తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఎర్రిస్వామి శుక్రవారం విలేకరులకు తెలిపారు. టీడీపీకి చెందిన పూజారి వెంకటేష్, పులికొండ కేశవ్‌తో పాటు మరో 11 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీకి చెందిన ఎ.బి.సోమలింగప్ప, ఈరన్నతో పాటు మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అల్లర్లు, గొడవలు జరగకుండా డీఎస్పీ శివనారాయణస్వామి ఆదేశాల మేరకు పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు, గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదని ఎస్‌ఐ హెచ్చరించారు.

తుంగభద్రకు జలకళ



సి.బెళగల్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నది జలకళను సంతరించుకుంది. జిల్లాలోని పడమటి ప్రాంతాలతోపాటు నది పరివాహ గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో శుక్రవారం నదికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చింది. నదీతీర గ్రామాల్లో తాగు, సాగు నీటి సమస్యలు తీరాయని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. పంటల సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

పొలం తగాదాలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణశివారు భరత్‌నగర్ కాలనీలో శుక్రవారం పొలం విషయంలో అన్నదమ్ములు ఘర్షణ పడి గాయాలపాలయ్యారు. బాధితుడు పెద్ద తిక్కన్న తెలిపిన వివరాలు.. తనకు వచ్చిన వాటా భూమిని అమ్ముకున్నందుకు తమ్ముడు కందనాతయ్య కక్షగట్టాడన్నారు. శుక్రవారం పొలంలో పనిచేస్తున్న తనపై తమ్ముడు, అతని కుమారులు ఐదుగురు కలిసి దాడి చేశారని వాపోయారు. బంధువులు వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారన్నారు. ఈ మేరకు కందనాతయ్య కూడా పొలంలో పని చేస్తుండగా తనపై పెద్ద తిక్కన్న దాడి చేశారని తెలిపాడు. ఇరువురు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఆదోని అర్బన్: పట్టణ ప్రజలు ఇళ్ల ముందు, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని గ్రీనరీ క్లబ్ సభ్యులు శ్రీధర్, లలిత, హరిత, కోమల, వినీత, విరుపాక్షిరెడ్డి, ఉమాకోటేశ్వరి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రీనరీ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేడీ కాలనీలో 150 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు సకాలంలో కురవాలంటే మొక్కలను పెంచాలన్నారు. కాలుష్యాన్ని పారద్రోలాలంటే మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. అనంతరం మొక్కలను నాటారు. అలాగే ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ అంబేడ్కర్ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్మీడియెట్ ఇంగ్లీష్ మీడియం మొదటి సంవత్సరం ఎంఈసీలో ఖాళీగా 16 సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం కళాశాలలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. పది పబ్లిక్ పరీక్షలలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు సంబంధించిన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులను స్థానిక ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రారంభంనాటికి 480 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేయాల్సిందిగా ఆలూరు ఎంఈఓ కోమలాదేవిని కోరినట్లు తెలిపారు.

పరామర్శ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల టీడీపీ నాయకుడు బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడుని ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు శుక్రవారం పరామర్శించారు. ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన సుబ్బరాయుడి స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట పార్టీ నాయకులు జయరాముడు, లక్ష్మిరెడ్డి, అమర్‌నాథ్‌గౌడ్, కోదండపాణి, సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.